



బ్రాహ్మణకొట్కూరు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, దర్గావద్ద ప్రత్యేక ప్రార్థనలో ముస్లింలు, పండుగ విశిష్టతను వివరిస్తున్న మత పెద్ద

త్యాగానికి ప్రతీక బక్రీద్



ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

- మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- పండుగ విశిష్టతను వివరించిన మత పెద్దలు

నందికొట్కూరు : త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 7 గంటలకు ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బస్టాండ్ సమీపంలోని పొలాల్లో ఉన్న ఈద్గాలో ఉదయం 7గంటలకు, బస్టాండ్ వద్ద ఉన్న పెద్ద ఈద్గాలో 9గంటలకు నమాజు చేశారు. నమాజు పూర్తయిన అనంతరం ముస్లింల కుటుంబాల్లో ఖుర్బానీ పర్వం మొదలైంది. మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బానీ ఇచ్చిన విందుకు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ హాజరయ్యారు. బక్రీద్ సందర్భంగా రబ్బానీ గ్రూపు అధినేత హాజీ మహబూబ్ సాహెబ్‌ను, మున్సిపల్ వైస్ చైర్మన్‌ను, కౌన్సిలరు జాకీర్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

మిడుతూరు: మండలకేంద్రంతోపాటు కడుమూరు, దేవనూరు, చౌట్కూరు, తలముడిపి, కలమందలపాడు తదితర గ్రామాల్లో బక్రీద్ వేడుకలను ముస్లింలు గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు పర్వదిన విశిష్టతను వివరించారు. అనంతరం ఒకరినొకరు పర్వదిన శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

నందికొట్కూరు రూరల్ : మండలంలోని బ్రాహ్మణకొట్కూరు, దామగట్ల, బొల్లవరం, మల్యాల తదితర గ్రామాల్లో గురువారం బక్రీద్ పండుగను ముస్లింలు ఘనం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పగిడ్యాల: త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ వేడుకలను ముస్లింలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, తూర్పు వనుములపాడు, సంకిరేణిపల్లె, బీరవోలు, పగిడ్యాల, లక్ష్మాపురం, పడమర ప్రాతకోట, ఎస్. ఘణపురం తదితర గ్రామాల్లోని ఉదయాన్నే ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రేమ, త్యాగం, సహనానికి ప్రతి రూపం అయిన బక్రీద్ వేడుకలు ముస్లింలకు ఆచరణీయమని మౌజన్‌లు వివరించారు.

కొత్తపల్లి: బక్రీద్‌ను గురువారం మండలంలో ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. దుద్యాల, కొక్కెరంచ, ఎదురుపాడు, శివపురం, కొత్తపల్లి, ముసలిమడుగు, లింగాపురం, నందికుంట గ్రామాల్లో ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆత్మకూరు: త్యాగానికి ప్రతీక బక్రీదు పండుగ అని షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అంజాద్ అలీ అన్నారు. గురువారం బక్రీదు పండుగ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. పేదలపట్ల జాలీ, దయ కలిగి ఉండటమే బక్రీదు పండుగ ఇచ్చే సందేశమన్నారు.

పాములపాడు: త్యాగానికి ప్రతీకగా నలిచిన బక్రీదు పండుగ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో ముస్లింలు ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలతో నమాజు చేశారు. మత గురువులు బక్రీదు పండుగ విశిష్టతను వివరించారు.

మహానంది: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో మసీదులు, ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



పాములపాడులో ఈద్గా వద్ద నమాజులో ముస్లింలు



సున్నిపెంటలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



శుభాకాంక్షలు తెలుపుకొంటున్న ముస్లింలు





ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి,



కొలనుభారతిలో సరస్వతీ దేవికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



మహానందీశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు,



ప్రత్యేక అలంకరణలో తర్తూరు రంగనాథస్వామి

మిడుతూరు: మండలకేంద్రంతోపాటు దేవనూరు, పీరుసాహెబ్ పేట, చెరుకుచెర్ల, తిమ్మాపురం, రోళ్లపాడు, చౌట్కూరు, మాసపేట, కడుమూరు, నాగలూటి, పైపాలెం తదితర గ్రామాల్లో తొలి ఏకాదశి వేడుకలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

మహానంది: తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా మహానందిలో భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్థానిక కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి, కోదండరామాలయం, ఆంజనేయస్వామి ఆలయాలను దర్శించుకుని పూజలు చేపట్టారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉదయం నుంచి ప్రారంభమైన దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. దర్శనం అనంతరం భక్తులు రాతినంది, పెద్దనంది విగ్రహాలను తిలకించారు.

పగిడ్యాల: మండలంలోని గ్రామాల్లో గురువారం తొలి ఏకాదశి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే పవిత్ర స్నానాలు ఆచరించి దేవాయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సందడితో ఆయా గ్రామాల్లోని దేవాలయాలు కళకళలాడాయి.

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం ప్రజలు తొలి ఏకాదశి పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఉపవాస దీక్షలతో దేవాలయాలకు వెళ్లి స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్నారు.

జూపాడుబంగ్లా: తొలిఏకాదశి పర్వదినాన్ని ఆదివారం మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, తర్తూరు, మండ్లెం, 80బన్నూరు, తరిగోపుల, పి.లింగాపురం తదితర గ్రామాల్లోని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే ఆయా గ్రామాల్లోని వైష్ణవాలయాల్లోని విష్ణుమూర్తి ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. తర్తూరు, జూపాడుబంగ్లా గ్రామాల్లో వెలసిన శ్రీలక్ష్మీరంగనాథ స్వామి, భూదేవి, శ్రీదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

కొత్తపల్లి: నల్లమల అటవీప్రాంతంలో వెలసిన కొలను భారతి దేవి పుణ్య క్షేత్రంలో గురువారం ఏకాదశిని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పురోహితులు ప్రాతఃకాలంనే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి ధారుఘోషిని నదీజలాలలో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి వంటి పూజా క్రతువులను జరిపించారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు భక్తితో అమ్మవారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం క్షేత్రంలో గురువారం తొలిఏకాదశి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. శ్రీ గౌరీ సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వార్లకు ఆలయ అర్చకులు ఉదయం నుంచి ప్రత్యేక అభిషేక, అర్చనలు చేపట్టారు. స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు జరిపించారు. వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి,అమ్మవార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకున్నారు. అలాగే.. మహానంది మండలం గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో వెలిసిన శ్రీ గంగా, గౌరీ సమేత శ్రీ మరకతలింగేశ్వరస్వామి వార్లకు విశేష పూజలు చేపట్టారు.



శాకాంబరి అలంకారంలో వాసవీమాత



శాకాంబరిగా అంకాల పరమేశ్వరి

అమ్మవారితో పాటు శ్రీ భూదేవి సమేత శ్రీ జనార్థన స్వామి వారికి విశేషపూజలు జరిపారు. భక్తులు వారి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

క్లుప్తంగా

బ్రిడ్జి పనులకు భూమి పూజ

పగిడ్యాల: బీరవోలు– పగిడ్యాల గ్రామాల మధ్య కేసీ కెనాల్‌పై శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి స్థానంలో డబల్ లైన్ కొత్త బ్రిడ్జి నిర్మాణానికి సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్యాల నాగిరెడ్డి గురువారం భూమి పూజ చేశారు. శిథిలావస్థకు చేరిన పాత ముచ్చుమర్రి, పగిడ్యాల బ్రిడ్జీల స్థానంలో డబల్ లైన్ కొత్త బ్రిడ్జీలను నిర్మించేందుకు దాదాపు రూ.3 కోట్లు మంజూరయ్యాయి. బొబ్బిటి బాబురెడ్డి, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు మోక్షేశ్వరరెడ్డి, భూషిరెడ్డి, పల్లె సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నాగాభరణం విరాళం



ఈఓకు నాగాభరణం అందిస్తున్న దాతలు

మహానంది: బండిఆత్మకూరు మండలం ఓంకారం పుణ్యక్షేత్రంలో కొలువైన శ్రీ ఓంకార సిద్ధేశ్వరస్వామికి నందికొట్కూరు మండలం బిజినవేముల గ్రామానికి చెందిన తిరుపతయ్య దంపతులు ఇత్తడి నాగాభరణం అందజేశారు. గురువారం ఆలయానికి వచ్చిన వారు స్వామి,అమ్మవార్లను దర్శించుకుని అనంతరం ఈఓ నాగప్రసాద్, అర్చకులు చక్రపాణికి నాగాభరణం అందించారు. దాతలకు స్వామి,అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేయించారు.

సీనియర్ న్యాయవాది ఆత్మహత్య



సూదిరెడ్డి వెంకటరెడ్డి (ఫైల్)

నందికొట్కూరు: అప్పుల బాధ భరించ లేక సీనియర్ న్యాయవాది పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణంలోని సంగయ్య పేటలో సూదిరెడ్డి వెంకటరెడ్డి(58) నివాసముంటున్నారు. బుధవారం ఇంట్లోనే పురుగు మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మృతుడికి భార్య రమాదేవి, కుమారులు వంశీకుమార్‌రెడ్డి, పార్థసారధిరెడ్డి ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ విజయభాస్కర్ తెలిపారు. వెంకటరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ నాయకులు బైరెడ్డి మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం మృతదేహానికి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, ఆర్టీసీ బాబు ఉన్నారు.

కడుపునొప్పి తాళలేక యువతి..

కడుపునొప్పి తాళలేక ఓ యువతి గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. హెడ్ కానిస్టేబుల్ బీ.వీ.రమణ తెలిపిన వివరాల మేరకు.. సాయిబాబాపేటకు చెందిన ఈశ్వరమ్మ, స్వామన్న దంపతుల కుమార్తె గడ్డల సృజన (24) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఇంట్లోనే ఉంటూ పని చేస్తుంది. ఈమె తరుచూ కడుపునొప్పితో బాధపడుతుండేది. ఈ క్రమంలో నొప్పి తట్టుకోలేక సూపర్‌వాస్‌మెల్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పొందుతూ మృతి చెందింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు పేర్కొన్నారు.

అదుపులోకి అతిసార

వెలుగోడు: మండలంలోని గుంతకందాల గ్రామంలో ఐదు రోజుల క్రితం ప్రబలిన అతిసార వ్యాధి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తీసుకున్న చర్యల వల్ల పూర్తిగా అదుపులోకి వచ్చింది.

వేడుకగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

మహానంది: బండిఆత్మకూరు మండలం కాకనూరు గ్రామంలో శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు గురువారం వేడుకగా నిర్వహించారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి హాజరయ్యారు. వారికి గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. వారు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి, కాకనూరు శివనాగిరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసానిని ఆహ్వానిస్తున్న గ్రామపెద్దలు

బలపాలతిప్పను వదలని పెద్ద పులి

- ముళ్ల పొదల్లో మాటువేసిన వ్యాఘ్రం
- గ్రామంలోకి చొరబడేందుకు యత్నించిన వైనం
- పట్టుకునేందుకు అటవీశాఖ అధికారుల యత్నాలు



పెద్దపులి సంచరించిన ప్రాంతాలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

కొత్తపల్లి: సంగమేశ్వరం సమీపంలోని బలపాలతిప్ప గ్రామాన్ని పెద్దపులి వదలడం లేదు. ముళ్ల పొదల్లో మాటువేసి వేట కోసం వేచి చూస్తుంది. పెద్దపులిని అటవీ ప్రాంతంలోకి పంపేందుకు అటవీశాఖ అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు. 20 మంది సిబ్బంది, రెస్క్యూ టీమ్, 20కి పైగా ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసినా పెద్దపులి భయం బలపాలతిప్ప గ్రామ ప్రజలను వీడటం లేదు. సోమవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన పశువుల నారాయణకు చెందిన ఆవుల మందపై దాడిచేసి కోడేదూడను హతమార్చింది. మంగళవారం రాత్రి కూడా ఆదేవ్యక్తికి చెందిన ఆవుల మందపై దాడిచేసి లేగ దూడను చంపేసింది. రక్తం రుచి మరిగిన పెద్దపులి గ్రామ శివారులోని ముళ్లపొదల్లో మాటువేసి వేట కొనసాగించేందుకు చూస్తుంది. దీంతో గ్రామస్తులు భయంతో బెంబేలెత్తి పోతున్నారు. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో నీటి మునక భూముల నుంచి ఆంజనేయస్వామి గుడి సమీపం నుంచి ఊర్లోకి వచ్చేందుకు ప్రయత్నించింది. గమనించిన గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు చెప్పారు. వారు డ్రమ్స్‌తో శబ్దాలు చేస్తూ, టపాసులు పేలడంతో పెద్దపులి తిరిగి వెళ్లిపోయింది. అటవీశాఖ సిబ్బంది, గ్రామస్తులు రాత్రంతా జాగారణ చేసి పెద్దపులిని గ్రామంలోకి చూశారు. గురువారం ఆత్మకూరు ఎఫ్ఆర్ఓ పట్టాభి, ఎఫ్ఎస్ఓ నాగేశ్వరావుతో కలసి పెద్దపులిని బంధించేందుకు రెస్క్యూవ్యాన్, సిబ్బందితో అటవీ ప్రాంతంలో గాలిస్తున్నారు.



పెద్దపులిని బంధించేందుకు తీసుకొచ్చిన రెస్క్యూవ్యాన్

గంజాయి స్వాధీనం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పోలీసులు గురువారం గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని సాయిబాబానగర్‌లో నివసించే షాకీర్ హుసేన్ ఇంట్లో సోదాలు నిర్వహించగా 19.5 కేజీల గంజాయి లభించింది. డీఎస్పీ శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ నిందితుడు షాకీర్ హుసేన్ అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నుంచి లారీలో గంజాయిని ఆత్మకూరుకు రవాణా చేసినట్లు తెలిపారు. లారీ డ్రైవర్‌గా పని చేసే షాకీర్ హుసేన్ ఇటీవల ప్రమాదానికి గురవడంతో కాలు విరిగింది. దీంతో డ్రైవింగ్‌కు వెళ్లలేని ఆయన గంజాయి అక్రమంగా రవాణా చేసి విక్రయించడాన్ని జీవనంగా ఎంచుకున్నాడన్నారు. సాయిబాబా నగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని గంజాయిని నిల్వ ఉంచి విక్రయిస్తున్నాడని చెప్పారు. సీఐ సుబ్రహ్మణ్యం ,సెబ్ సీఐ నాయుడు,ఎస్ఐ కృష్ణమూర్తి ఉన్నారు.



పట్టుబడిన గంజాయితో పోలీసులు

నిబంధనలు కృష్ణార్పణం

- అధికారుల చెబుతున్నా కృష్ణానదిపై ప్రజారవాణా
- మరబోట్లలో తెలంగాణ నుంచి ఆంధ్రా వైపు భక్తుల తరలింపు

కొత్తపల్లి: రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మరబోట్ల వివాదం అందరికి తెలిసిన విషయమే. ఈ సమస్యను పరిష్కరించేందుకు జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి అధ్యక్షతన సంగమేశ్వరం వద్ద జనవరి 3న రెండు రాష్ట్రాల మరబోట్ల నిర్వాహకులు, మత్స్యకారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎవరూ కృష్ణానదిలో బోటు తిప్పకూడదని ఆదేశించారు. అయితే ఎస్పీ నిబంధనలను తెలంగాణ బోటు నిర్వహకులు కృష్ణానదిలో కలిపేశారు. గురువారం ఏకాదశి కావడంతో తెలంగాణ నుంచి ఇవతలి వైపు ఉన్న సంగమేశ్వరాలయానికి భక్తులను, ప్రయాణికులను వందల సంఖ్యలో మరబోట్లలో తరలించారు. సొమ్ములకు ఆశపడి బోట్లు కిటకిటలాడుతున్నా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ప్రయాణికులకు ఎటువంటి లైఫ్ జాకెట్లు లేకపోయినా వందలాది మందిని తీసుకెళ్తున్నారు. సంబధిత అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



మరబోట్లలో తరలివెళ్తున్న భక్తులు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నందికొట్కూరు రూరల్ : మండలంలోని శాతనకోట గ్రామంలో రూ.14 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించినట్లు గ్రామ సర్పంచ్ జనార్దన్‌గౌడు తెలిపారు.

1 నుంచి జగనన్న సురక్ష క్యాంపులు

కొత్తపల్లి: జగనన్న సురక్ష పథకంలో భాగంగా జూలై 1 నుంచి 27వ తేదీ వరకు అన్ని గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహిస్తామని ఎంపీడీఓ మేరి గురువారం తెలిపారు. మండలంలోని అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి క్యాంపుల్లో పాల్గొంటారని చెప్పారు. జూలై 1 దుద్యాల, 4న ఎదురుపాడు, 5 నందికుంట (దుద్యాల–2), 11న కొత్తపల్లి, 13న గోకవరం, 15న ఎర్రమఠం, 18న గుమ్మడాపురం, 20న కొక్కెరంచ, 22న గువ్వలకుంట్ల, 25న శివపురం, 27వతేదిన ముసలిమడుగు గ్రామాల్లో క్యాంపులు చేపడుతున్నట్లు వివరించారు.

నేడు ‘గడప గడపకు మన ప్రభుత్వం’

మిడుతూరు: నాగలూటి గ్రామంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి గురువారం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పాల్గొంటారని చెప్పారు.

మహానంది: బండిఆత్మకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఎరుకల కాలనీ గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉదయం ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొంటారని చెప్పారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జిల నియామకం

నందికొట్కూరు: జేసీఎస్ మండల కన్వీనర్లను ఎంపిక చేసిన జాబితాను వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం గురువారం విడుదల చేసింది. నందికొట్కూరు మండలం జేసీఎస్ కన్వీనర్‌గా ఓంకార్ రెడ్డి, మిడుతూరు మండల కన్వీనర్‌గా బి.రవికుమార్, పగిడ్యాల మండల కన్వీనర్‌గా జీ.రమేష్ నాయుడు, జూపాడుబంగ్లా మండల కన్వీనర్‌గా కేశవరెడ్డి నాగార్జునరెడ్డి, పాములపాడు మండల కన్వీనర్‌గా వెంకటరమణారెడ్డి, కొత్తపల్లి మండల కన్వీనర్‌గా నాగలక్ష్మిరెడ్డి, నందికొట్కూరు మున్సిపాలిటీ కన్వీనర్‌గా అబుబక్కర్‌ను నియమించారు.

ఆత్మకూరు: శ్రీశైలం జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌గా అబ్దుల్‌రజాక్, ఆత్మకూరు మండల ఇన్‌చార్జ్‌గా శివశంకర్‌రెడ్డి, ఆత్మకూరు పట్టణ ఇన్‌చార్జ్‌గా సుల్తాన్‌బాషా, బండిఆత్మకూరు మండల ఇన్‌చార్జ్‌గా పుల్లారెడ్డి, మహానంది ఇన్‌చార్జ్‌గా మహేశ్వరరెడ్డి, వెలుగోడు మండల ఇన్‌చార్జ్‌గా దేశం తిరుపంరెడ్డిని నియమించారు.

పథకాల అమలులో రాష్ట్రం ఆదర్శం



ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

శ్రీశైలంటెంపుల్: సంక్షేమ పథకాల అమలులో దేశంలోని రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. గురువారం శ్రీశైలంలోని అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్న–సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, మండల కన్వీనర్లు, పార్టీ నాయకులు, అధికారులు అందరూ కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే రాష్ట్రంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇంకా ఎవరైనా అర్హులై ఉండి సాంకేతిక కారాణల వల్ల పథకాలు వర్తించకపోతే అలాంటి వారు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందాలన్నారు. అర్హులందరికీ పారదర్శకంగా అవసరమైన ధ్రువ పత్రాలు అందజేస్తున్నామని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ.రజాక్, మండల ఇన్‌చార్జ్ భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒంటరిగా పోటీ చేసే సత్తా ఉందా?

త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీకైనా దమ్ముంటే ఒంటరిగా పోటీ చేసే సత్తా ఉందా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీలకు తిమ్మ తిరిగేలా రాష్ట్రంలోని ప్రజలు జగనన్నకు మళ్లీ పట్టం కట్టబోతున్నారన్నారు. పథకాల అమలుతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. 175 స్థానాల్లో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

టీడీపీ.. తుప్పు పట్టిన పార్టీ..

చంద్రబాబు గతంలో మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయలేదని శిల్పా మివర్శించారు. టీడీపీ తప్పు పట్టిన పార్టీ అని, ఎంత రిపేరీ చేసిన తుప్పు వదలదని ఎద్దేవా చేశారు. దత్తపుత్రుడిని వెంటపెట్టుకుని ఊరూరా తిరుగుతూ చెప్పులు చూపించుకుంటున్నారన్నారు. అడపడుచులు ఎంత అప్పు చేస్తే అంత మొత్తం పూర్తిగా రుణమాఫీ చేస్తానని చెప్పి, ఎన్నికల్లో గెలిచిన తరువాత నేను చెప్పింది రూ.లక్ష అని నాలుక మడతేసిన సంగతి అక్కచెల్లెమ్మలు మరిచిపోలేదని గుర్తు చేశారు. అయితే అందులో మూడు విడతలుగా చెల్లించింది రూ.10వేలేనన్నారు.

శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసి, భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు గాను సత్రాల సమాఖ్య సహకరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సూచించారు. గురువారం స్థానిక మల్లికార్జున కల్యాణ మండపంలో శ్రీశైల క్షేత్ర సత్రాల, ఆశ్రమ, మఠం నిర్వాహకులతో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డవారి చక్రపాణిరెడ్డి, ఈఓ ఎస్.లవన్నతో కలిసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మంత్రి మాట్లాడుతూ త్వరలో క్షేత్రాభివృద్ధి కోసం సుమారు రూ.150కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మాడ వీధుల విస్తరణ, నూతన క్యూ కాంప్లెక్స్, ఆలయం ఎదురుగా దుకాణాల తొలగింపు స్థానంలో సాలు మండపాల నిర్వహణ, భక్తుల సౌకర్యార్థం డార్మెంటరీల నిర్మాణం తదితర పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్ర పరిధిలో సుమారు 70 అన్నదాన సత్రాలు ఉన్నాయని వారందరి ఆమోదంతో దేవస్థానానికి కొంత ఆదాయం అందించేలా సహకరించాలని కోరారు. అలాగే ఎవరికి ఇబ్బందులు లేకుండా ఒక కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు.

వర్షం కురవాలని..

పాములపాడు: సకాలంలో వర్షాలు కురవాలని, పాడి పంటలతో అందరూ సంతోషంగా ఉండాలని నాగసాయి బ్రహ్మవిద్య ఆశ్రమ పీఠాధిపతి శ్రీరామానంద స్వామి గురువారం పాదయాత్ర చేపట్టారు. మండలంలోని జూటూరు గ్రామం సాయిబాబా ఆలయం నుంచి జూపాడుబంగ్లా మండలంలోని తర్తూరు రంగనాథస్వామి దేవాలయం వరకు భక్త బృందంతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దైవారాధనతో మానవాళికి మంచి జరుగుతుందని చెప్పారు. 12 సంవత్సరాలుగా ఆషాడమాసం తొలి ఏకాదశి పర్వదినాన పాదయాత్ర చేస్తూ పాండురంగడు స్వామిని దర్శిస్తే సకల శుభాలు కలుగుతాయని, అందరూ సుభిక్షంగా ఉండాలని లోక కల్యాణార్థం కార్యక్రమాన్ని కొనిసాగిస్తున్నామన్నారు.



పాదయాత్రగా వెళ్తున్న పీఠాధిపతి, భక్త బృందం